పల్లె ప్రకృతి.. నిర్వహణలో వికృతి

- ఎండిపోతున్న మొక్కలు.. ప్రజలకు ఆహ్లాదం కరువు
- నిధుల సమస్యతో అధ్వానంగా తయారవుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


సింగాపూర్ గ్రామ శివారులో నిర్మించిన పల్లె ప్రకృతివనం దుస్థితి

హుజూరాబాద్‌రూరల్: ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు లక్షలు వెచ్చించి నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో నిర్మించిన వాటిల్లో కొన్ని మాత్రమే బాగుండగా మరికొన్ని చెత్తాచెదారం, ఎండిన మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరక పోగా రూ.లక్షలు వృథా అయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారిస్తే ప్రకృతి వనాలు సుందరంగా తయారవుతాయని పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో అధికారులు పల్లె ప్రకృతి వనాలను నిర్మించారు. వీటి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను కేటాయించింది. కొన్ని వనాలు ప్రజలను ఆకర్షిస్తుండగా కొన్ని పంచాయతీల్లోని వనాలు అధ్వానంగా మారాయి. పిచ్చి మొక్కలు దర్శమిస్తున్నాయి. మరికొన్ని మొక్కలు చనిపోయాయి. కనీసం వాటి స్థానాల్లో కొత్త మొక్కలను నాటలేదు. వాటి పక్కన వెళ్లేవారు అసలు ఇవి పల్లె ప్రకృతి వనాలా లేక ఎండిన చిట్టడవులా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. నీరు పోయక పోవడం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం కూడా మొక్కలు చనిపోవడానికి ఒక కారణమని తెలుస్తోంది.

గ్రామాలకు దూరంగా...

ప్రకృతి వనాలు గ్రామాలకు దూరంగా నిర్మించడంతో వృథాగా మారుతున్నాయి. మండలంలోని చాలా గ్రామాల వరకు పల్లె ప్రకృతి వనాలు కిలోమీటర్ల పరిధిలో నిర్మించడం వల్ల వనాలు ప్రజలకు ఉపయోగపడటం లేదు. ప్రకృతి వనాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో రాత్రి వేళ మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయమవుతున్నాయి.

ఉపయోగం లేదు



పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఉపయోగపడడం లేదు. గ్రామాలకు దూరంగా ఉండటంతో ప్రజలు వాటివైపు చూడడం లేదు. వనాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. అధికారులు ప్రజల సూచన మేరకు వనాలను ఏర్పాటు చేసుంటే బాగుండేది.

– గిన్నారపు మహేందర్, జూపాక

సమీపంలో ఉంటే బాగుండేది



పల్లెప్రకృతి వనాలు అందుబాటులో ఉంటే ఉపయోగంగా ఉంటుంది. అధికారులు తీసుకున్న నిర్ణయాలతో ప్రకృతి వనాలు నిర్మించినా కూడా ఉపయోగించుకోలేని పరిస్థితి వచ్చింది. గ్రామ పంచాతీయలకు సమీపంలో ఏర్పాటు చేస్తే బాగుండేది.

– బండ రాధ, రంగాపూర్

చర్యలు తీసుకుంటాం..



ప్రకృ వనాల్లో ఈజీఎస్ ద్వారా పనులు చేయించాం. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు చేయించాల్సి ఉంది. వర్షాలు పడటంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. లేబర్ సమస్య ఉంది. గ్రామాల వారీగా వనాలను సందర్శించి పిచ్చిమొక్కలు తొలగించే చర్యలు తీసుకుంటాం.

– జయశ్రీ,ఎంపీడీవో, హుజూరాబాద్

క్లుప్తంగా

పార్టీ గెలుపునకు సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కార్యకర్తలను కోరారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో గురువారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలు వివరించాలన్నారు. కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకెళ్లి బీఆర్‌ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, గ్రామ ఇన్‌చార్జి దేవసతీశ్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, ఎంపీటీసీ గడ్డి రేణుకగణేశ్, నాయకులు పడాల శంకరయ్య, గౌష్, రహ్మత్, సర్పంచ్ రొద్ద పృథ్వీరాజ్, గుర్రం కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారి

ఇల్లందకుంట: మండలంలోని లక్ష్మాజిపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మల్లిపల్లెగూడెం శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ అధికారి నర్సింహ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన వంటి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటీఎం, గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే తదితర సౌకర్యాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంతం ఎల్లారెడ్డి, నల్ల లింగారెడ్డి, నన్నెబోయిన రవియాదవ్, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతారెడ్డి

చిగురుమామిడి: బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా వొడితెల సతీశ్‌కుమార్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఎంపీపీ కొత్త వినీతారెడ్డి, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య కోరారు. గురువారం చిగురుమామిడి, సుందరగిరి, ఉల్లంపల్లి, ఇందుర్తి, గ్రామాల్లో కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో మాట్లాడారు. ఈ నెల 15న హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశాల్లో చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు లక్ష్మణ్, చెప్యాల మమత, నాయకులు ఆకవరం శివప్రసాద్, బెజ్జంకి రాంబాబు, ఎండీ సర్వర్‌పాషా, గొల్లపల్లి అరుణ పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్


గన్నేరువరంలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

గంగాధర: మండలంలోని నారాయణపూర్, చర్లపల్లి ఎన్ గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, బూర్గు గంగయ్య, చక్రపాణి, సత్యనారాయణ, శంకర్, రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందరి సంక్షేమానికి పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. జిల్లా కార్యదరి సునీల్, పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, కూన కొమురయ్య, పర్శరాం, అజయ్, నవీన్, హరీశ్, ప్రశాంత్, అభిలాష్ పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ

చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, టీచర్లు బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు.


ఇల్లందకుంటలో బతుకమ్మ వేడుకలు


జమ్మికుంట: దుర్గామాత రూపంలో బతుకమ్మ


సైదాపూర్: ఆకునూర్ పాఠశాలలో...


గంగాధర: బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు


గన్నేరువరం: వాగ్దేవి పాఠశాలలో...


చొప్పదండి: రెవెళ్లిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎమ్మెల్యేగా అవకాశమిస్తే రూ.1000 కోట్లతో అభివృద్ధి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని రూ.1000 కోట్ల నిధులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను నిలబెట్టాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ నిర్మల, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, వార్డుల కౌన్సిలర్లు ముత్యంరాజు, శ్రీనివాస్, కుమార్, మాజీ కౌన్సిలర్ కమలాకర్, మాజీ ఎంపీటీసీ శ్రీదేవి, వార్డు శాఖల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాములపల్లి, కనగర్తి, లక్ష్మాజిపల్లి, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల్లో బీఆర్‌ఎస్ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్యకార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సమన్వయంతో పనిచేసి హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాకేశ్, సర్పంచి టి.మొగిలి, పుట్టరాజు, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ అందజేత


గ్రామస్తుల సమక్షంలో సైకిల్ అందిస్తున్న సతీశ్

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి కి చెందిన కూన శిరీష ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇందుర్తి జెడ్పీపాఠశాలకు రోజూ రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్తోంది. విషయాన్ని గాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మంద శ్రీనివాస్ సామాజిక మాధ్యమాల్లో తెలిపాడు. బొట్ల పురుషోత్తం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బొట్ల సతీష్ స్కూల్ బ్యాగ్‌తో పాటు రూ.ఎనిమిదివేలు విలువ సైకిల్‌ను గురువారం అందజేశారు. భవిష్యత్‌లో చదువుకయ్యే ఖర్చుకు సహకరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు, విద్యార్థిని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ట్రస్టుపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో రామారావు, నర్సింహారెడ్డి, మధు, రవీందర్‌రెడ్డి, కుమార్, సురేశ్, రాజయ్య, రాజబహదూర్, శ్రీనివాస్, వెంకటయ్య, రవి, తిరుపతి, ఎల్లయ్య, ముత్తయ్య పలువురు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక



తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన పారునంది జలపతి బహుజన సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ, నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా–2023 ఆధ్వర్యంలో అందించే అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జలపతి మాట్లాడుతూ.. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల వద్దకు తీసుకెళ్లినందుకు అవార్డు ప్రదానం చేయనున్నారని తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 15న ఢిల్లీలో జరిగే కాన్ఫరెన్స్ హాల్లో అవార్డు ప్రదానం చేస్తారని వివరించారు. ఈసందర్భంగా జలపతిని జిల్లా, మండల నాయకులు బాపన్న, కొమురయ్య, మహేశ్, మీసాల అంజయ్య, సంపత్, మురళి, సంపత్, రవి, అశోక్ తదితరులు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మేడిపల్లి సత్యం

గంగాధర: రామడుగు మండల కేంద్రానికి చెందిన పంజాల శ్రీనివాస్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అధిష్ఠానం నియమించింది. ఈసందర్భంగా శ్రీనివాస్ నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. శ్రీనివాస్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి, చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అభినందించారు.

బీసీ ప్రజాసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అయోధ్యగౌడ్


నియామకపత్రం ఇస్తున్న భరత్

జమ్మికుంట: తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పైడిపల్లి అయోధ్య గౌడ్‌ను నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాయిని భరత్ తెలిపారు. ఈమేరకు గురువారం నియామక పత్రం అందజేశారు. అయోధ్యగౌడ్ మాట్లాడుతూ.. బీసీ హక్కుల కోసం పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

ఎంగిలిపూల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయం(బొమ్మలగుడి) ప్రాంగణంలో ఈ నెల 14న నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు గురువారం పరిశీలించారు. పండుగకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరవుతారని, పట్టణంలోని ఆడపడుచులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, కౌన్సిలర్లు మద్ది లావణ్య, దిడ్డి రాము, నాయకులు మునిపట్ల తిరుపతిరెడ్డి, బోగం వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

హుజూరాబాద్: పట్టణంలోని 23వ వార్డు బుడిగ జంగం కాలనీవాసులు సమస్యలు పరిష్కరించాలని గురువారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ముప్పై ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నప్పటికీ, కరెంట్, మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తూర్పాటి రాజు, మోటం రాంచంద్రం, శ్రీనివాస్, మోటం తిరుపతి, సమ్మయ్య, పోచయ్య, రాజశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలని, అంశాన్ని మేనిఫెస్టోలో పొందుపర్చాలని కోరుతూ గురువారం జిల్లా సాధన సమితి నాయకులు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ కేంద్రంగా జిల్లా ఆవశ్యకతను వివరించారు. మేనిఫెస్టోలో విషయాన్ని పొందుపరచి హుజూరాబాద్ ప్రాంత ప్రజలకు హామీ ఇస్తుందని శ్రీధర్‌బాబు తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ జిల్లా జేఏసీ నాయకులు వర్దినేని రవీందర్‌రావు, ఆవునూరి సమ్మయ్య, వేల్పుల రత్నం, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, తాటిపల్లి రాజన్న, సంధ్యల వెంకన్న, చందుపట్ల జనార్దన్, ఆలేటి రవీందర్, భీమోజు సదానందం, సొల్లు బాబు తదితరులు ఉన్నారు.

15 నుంచి డీటీఎఫ్ మహాసభలు


డీటీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చొప్పదండి: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి కోరారు. చొప్పదండిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి మూడురోజుల పాటు మహబూబ్‌నగర్‌లోని అన్నపూర్ణ గార్డెన్‌లో మహాసభలు నిర్వహించనున్నామని, డీటీఎఫ్ ఆవిర్భవించి ఇరవై ఐదో వసంతంలోకి అడుగు పెడుతోందని, మహాసభల్లో విద్యారంగంలో వస్తున్న మార్పులు, సామాజిక, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నామనిచెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సముద్రాల అంజయ్య, మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, రబియా, జలపతి, జలీల్, పుష్పలత పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కేన్సర్‌పై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

చిగురుమామిడి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చాలా మంది మహిళలకు నోటి, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ వస్తుందని, ప్రాథమిక దశలో గుర్తిస్తే మనిషి జీవితకాలం పొడిగించవచ్చని వైద్యనిపుణులు రమాదేవి అన్నారు. గురువారం చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్ ఆధ్వర్యంలో కామన్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. మద్యం, ధూమపానం, తంబాకు, గుట్కా, జర్దా, జంక్‌ఫుడ్స్‌తో పాటు శారీరక శ్రమలేకపోవడం వల్ల కేన్సర్ వస్తుందన్నారు. మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో కేన్సర్‌ను గుర్తించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూసీ డాక్టర్లు సందీప్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి, లక్ష్మిప్రసన్న, మాధురి, నిర్మల, సూపర్‌వైజర్లు హజిబాబా, చంద్రకళ, హేమలత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

ఇల్లందకుంట: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్తులు, బెల్టుషాపు యజమానులను తహసీల్దార్ రాణి ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కరీంనగర్ సీపీ ఆదేశాలు, సీఐ కిషోర్ సూచనల మేరకు పలువురిని బైండోవర్ చేశామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సొంత గూటికి చేరిన ప్రజాప్రతినిధులు


ఎంపీపీ భర్తకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మానకొండూర్: మానకొండూర్ ఎంపీపీ ముద్దసాని సులోచన కాంగ్రెస్ గూటికి చేరారు. కొంత కాలంగా బీఆర్‌ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కొంత కాలంగా బీఆర్‌ఎస్‌లో ప్రాధాన్యత లభించడం లేదని బహిర్గతంగానే చెబుతూ వచ్చింది. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ఎంపీపీ, ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

గన్నేరువరం: గన్నేరువరం మండల పరిషత్ అధ్యక్షుడు లింగాల మల్లారెడ్డి సొంత గూటికి చేరారు. గురువారం తిమ్మాపూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. మూడేళ్ల క్రితం మల్లారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి ఏ పార్టీలోకి వెళ్లకుండా తటస్థంగా ఉన్నారు. ఈక్రమంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీపీడ్డితో మంత్రి కేటీఆర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పలుమార్లు సంప్రదింపులు జరిపిన అనంతరం పార్టీలోకి చేర్చుకున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, నాయకులు పుల్లెల లక్ష్మణ్, పుల్లెల సాయి తదితరులు పాల్గొన్నారు.


మల్లారెడ్డికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్